

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 22.0



మచ్చుకు కొన్ని..

జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర కాలనీకి చెందిన ఓ ఆరేళ్ల బాలికకు తీవ్ర జ్వరం రావడంతో శెట్టి కాంప్లెక్స్‌లోని ఓ చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి టెస్టులు చేయిస్తే డెంగీ, మలేరియా ఉందని తేలింది. రెండు రోజుల పాటు ట్రీట్‌మెంట్ చేశారు. బాధితులు బలవంతంగా డిశ్చార్జి చేయించుకొని హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో మళ్లీ టెస్టులు చేయించారు. అక్కడ డెంగీ, మలేరియా లేవని, సీజనల్ వ్యాధి అని మందులు రాసి పంపించారు.

- నర్వ మండలం రాజపల్లె గ్రామానికి చెందిన 50 ఏళ్ల భాగ్యమ్మకు డెంగీ ఉందని, ప్లేట్‌లేట్స్ 82 వేలు ఉన్నాయని మక్తల్‌లోని ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్‌లో రిపోర్టు ఇచ్చారు. ఆమె ఈనెల తొమ్మిదిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు అన్ని టెస్టులు చేస్తే సీజనల్ వ్యాధి అని రిపోర్టులు వచ్చాయి.
- వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన యువకుడు నాగేష్‌కు ప్లేట్‌లేట్స్ 76 వేలు ఉన్నాయని ప్రైవేటు ఆస్పత్రిలో రిపోర్టు ఇచ్చారు. ఆ యువకుడు ఈనెల తొమ్మిదిన జనరల్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుంటే.. ప్లేట్ లేట్స్ 1.20 లక్షలు ఉన్నట్లు వచ్చింది. సీజనల్ జ్వరమని ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు.



కాసుల కోసం.. కుమ్మక్కు

- రోగుల ప్రాణాలతో ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్ల చెలగాటం
- రక్త పరీక్షల రిపోర్టుల్లో వ్యాల్యూలను మారుస్తున్న ల్యాబ్‌లు
- డెంగీ, మలేరియా లేకున్నా ఉన్నాయంటూ రిపోర్టు
- ఫలానా ఆస్పత్రికే వెళ్లాలంటూ రెఫర్
- అడ్మిట్ అయిన రోగుల నుంచి రూ.20 వేలకుపైగా వసూలు
- రెఫర్ చేసినందుకు ఆర్‌ఎంపీలు, ల్యాబ్‌లకు ఆస్పత్రుల కమీషన్

మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కిక్కిరిసిన రోగులు



మహబూబ్‌నగర్(వైద్య విభాగం), సెప్టెంబరు 11: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ఆర్‌ఎంపీల క్లీనిక్‌లు రోగుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. కాసులకోసం కక్కుర్తి పడి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ రాకున్నా వచ్చాయని, ప్లేట్‌లేట్స్ తగ్గాయని రిపోర్టుల్లో వ్యాల్యూలను మారుస్తున్నాయి. వేల రూపాయలు ఫీజులు దండుకుని, ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రెఫర్ చేసినందుకు ఆర్‌ఎంపీలకు ఒక్కో కేసుకు రూ.500 నుంచి రూ.1,000 వరకు కమిషన్ ఇస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్ల ఆగడాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయి.

విచ్చలవిడిగా టెస్టులు

ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ప్రతీ ఇంట్లో వైరల్ జ్వరాల పీడితులు ఉన్నారు. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రులు విచ్చలవిడిగా టెస్టులు రాస్తున్నాయి. ఓపీ కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికి దాదాపు అన్ని టెస్టులు రాయడంతో వాటికే రూ.2,000 నుంచి రూ.2,500 వరకు ఖర్చవుతున్నాయి. మందులకు మరో రూ.1,000 నుంచి రూ.1,500 వరకు అవుతోంది. ఆస్పత్రిలో అడ్మిట్ అయితే దాదాపు రూ.20 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పలు ఆస్పత్రుల్లోని ల్యాబుల్లో రక్త పరీక్షల రిపోర్టులను మార్చి ఇస్తున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లేకపోయినా ఉన్నట్లు, ప్లేట్ లెట్స్ తగ్గకపోయినా తగ్గినట్లు రిపోర్టుల్లో వ్యాల్యూలను మారుస్తున్నారు. గత్యంతరం లేక రోగులు అదే ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారు. ఆ రిపోర్టుల ప్రకారం ట్రీట్‌మెంట్ చేసి, రెండు, మూడు రోజులకు రూ.వేలకు వేల ఫీజులు దండుకుంటున్నారు.

డయాగ్నొస్టిక్ సెంటర్లలోనూ అదే పరిస్థితి..

డయాగ్నొస్టిక్ సెంటర్లూ మోసాలకు తెరలేపాయి. చిన్న చిన్న ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ క్లీనిక్‌లతో ఆయా డయాగ్నొస్టిక్ సెంటర్లు కన్సల్టెన్సీ పెట్టుకుంటున్నాయి. దీంతో డాక్టర్లే కాకుండా ఆర్‌ఎంపీలు సైతం విచ్చలవిడిగా టెస్టులు రాస్తున్నారు. తద్వారా టెస్టులలో వ్యాల్యూలు మార్చి, రిపోర్టులు ఇస్తున్నారు. వాళ్ల ఫలానా ఆస్పత్రికే వెళ్లాలని చెప్పినందుకు చిన్న ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ క్లీనిక్‌ల యాజమాన్యాలు డయాగ్నొస్టిక్ సెంటర్ల యాజమాన్యాలకు ప్రతీనెల నెలకు రూ.ఐదు వేల వరకు ఇస్తున్నారని సమాచారం.

చర్యలు తీసుకుంటాం

జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ఆర్‌ఎంపీ క్లీనిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేస్తాం. ఎవరైనా రిపోర్టుల్లో వ్యాల్యూలను మార్చి ఇస్తున్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. డెంగీ కేసులకు సంబంధించి అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు శాంపిళ్లు టిహబ్‌కు పంపించాలని, అక్కడ నిర్ధారణ అయితేనే డెంగీ అని నిర్ధారించి ట్రీట్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించాం.

– డాక్టర్ పద్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఆర్‌ఎంపీలకు కమీషన్లు..

సీజనల్ వ్యాధులను ఆసరా చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్‌ఎంపీలు కమీషన్లకు తెరలేపారు. గ్రామాల్లో జ్వరం, జలుబు, దగ్గు వచ్చిందంటే ముందుగా ఈ ఆర్‌ఎంపీ క్లీనిక్‌లకు వెళ్తారు. వారు తమ పరిధికి మించి టెస్టులు చేయడంతో పాటు ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. ఇది చాలక పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేసి, కమీషన్లు తీసుకుంటున్నారు. రోగులను భయభ్రాంతులకు గురిచేసి, కచ్చితంగా తాను చెప్పిన ఆస్పత్రికే వెళ్లాలని ఆదేశిస్తున్నారు. ఇలా రెఫర్ చేసి, ఒక్కో కేసుకు రూ.500 నుంచి రూ.1,000 వరక కమీషన్లు తీసుకుంటున్నట్లు సమాచారం.

కిమ్మనని వైద్య ఆరోగ్యశాఖ..

ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తరచూ తనిఖీలు చేయాలి. వారు తీసుకునే ఫీజులు ఎంత?, ఎన్ని పడకలు ఉన్నాయి?, టెస్టులు ఎలా చేస్తున్నారు?, ఏం టెస్టులు చేస్తున్నారు?, ఎంత తీసుకుంటున్నారు?, ఆర్‌ఎంపీ క్లినిక్‌లలో అందిస్తున్న వైద్యం ఎలా ఉంది? అనే అంశాలపై పరిశీలించాలి. ధరలను నిర్ణయించడమే కాకుండా నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి. కానీ అధికారులు కిమ్మనడం లేదు. ఇప్పటికైనా స్పందించి.. తనిఖీలు చేపట్టాలని, పర్యవేక్షణ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



వనపర్తి జిల్లా అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీలో ఉన్న మగ్గాలు

అందిన.. చేయూత

- నేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ బకాయి విడుదల
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 9,625 కార్మికులకు లబ్ధి
- రూ.51.38 కోట్లు మంజూరు

అమరచింత, సెప్టెంబరు 11: చేనేత కార్మికుల ఎదురుచూపులు ఫలించాయి. త్రిఫ్ట్ ఫండ్(చేనేతకు చేయూత) కింద రాష్ట్ర ప్రభుత్వ వాటా 16 శాతాన్ని విడుదల చేయడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. 2021లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద కార్మికులు ప్రతీ నెల తమ ఆదాయంలో ఎనిమిది శాతం వాటాను బ్యాంకులోని ఆర్‌డీ అకౌంట్‌లో జమ చేయాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 16 శాతం కార్మికుల అకౌంట్లలో జమ చేయాల్సి ఉంది. కార్మికుడు నెలకు రూ.1,200 జమ చేస్తే ప్రభుత్వం 16 శాతం వాటా 2,400 జమ చేయాలి. పథకం కాలపరిమితి మూడేళ్లు. మగ్గం నేస్తున్న కార్మికుడితో పాటు ఇద్దరు సహాయకులు వారి వారి వేతనాలను బట్టి అకౌంట్‌లో డబ్బులు జమ చేసుకోడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 11 నెలలుగా తన వాటాను విడుదల చేయలేదు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో డబ్బులు వస్తాయో లేదోనని కార్మికులు ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మగ్గం నేస్తున్న కార్మికుడు

ఒకటి రెండు రోజుల్లో అకౌంట్‌లోకి డబ్బులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో జియో ట్యాగింగ్(ప్రభుత్వం గుర్తించిన) మగ్గాలు కలిగిన 9,625 మంది చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ ద్వారా లబ్ధి కలుగనుంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 7,106 మంది నేత కార్మికులకు రూ.35,70,69,180 విడుదల చేసింది. నారాయణపేట జిల్లాలో 1,207 మంది కార్మికులకు రూ.8,46,38,100 కోట్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో 269 మంది కార్మికులకు 2,18,74,200 కోట్లు, వనపర్తి జిల్లాలో 1,030 మంది కార్మికులకు రూ.4,98,67,000, నాగర్‌కర్నూల్ జిల్లాలో 11 మంది కార్మికులకు రూ.36,9,640 విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జియో ట్యాగింగ్ మగ్గాలు కలిగిన 9,625 మంది కార్మికులకు 51 కోట్లా 38 లక్షలను ఇచ్చింది. చేనేత, జౌళి శాఖ అధికారులు ఆయా బ్యాంకులకు ప్రభుత్వం విడుదల చేసిన చెక్కులను పంపించారు. ఒకటి రెండు రోజుల్లో కార్మికుల అకౌంట్‌లో డబ్బులు జమ కానున్నాయి.

చేతివాటానికి ముమ్మర ప్రయత్నాలు

త్రిఫ్ట్ ఫండ్ డబ్బులను ప్రభుత్వం విడుదల చేయడంతో నేత కార్మికుల వద్ద చేతి వాటానికి పైరవీకారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో పైరవీలు అధికంగా జరుగుతున్నాయని తెలుస్తోంది. కార్మికులు, వారి సహాయకులు 50 మంది, 100 మంది, 150 మంది గ్రూప్‌గా ఏర్పడి.. ప్రతీ నెల బ్యాంకులో డబ్బులు జమ చేసుకున్నారు. డబ్బులు బ్యాంకులో జమ చేసేందుకు ఒక్కో బృందంలో ఇద్దరు ముగ్గురు మధ్యవర్తులు ఉండేవారు. వారు ప్రతీ నెల డబ్బులు జమ చేసేందుకు ఒక్కో కార్మికుడి వద్ద రూ.50 అదనంగా తీసుకునే వారు. ప్రభుత్వం త్రిఫ్ట్ ఫండ్ నిధులను విడుదల చేయడంతో తమ ఆధ్వర్యంలో ప్రతీ నెల డబ్బులు బ్యాంకులో జమ చేయడంతోనే మీకు 16 శాతం వాటా వస్తున్నాయని ఒక్కో కార్మికుడి నుంచి రూ.రెండు వేల నుంచి రూ.నాలుగు వేల వరకు డిమాండ్ చేస్తున్నారని సమాచారం. ఈ విషయమై అధికారులు స్పందించి, పైరవీకారులపై చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

నెలకు రూ.1,200 జమ

నేను ఇంట్లో సొంతంగా మగ్గం పని చేస్తూ, వచ్చే ఆదాయంలో ప్రతీ నెల త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద రూ.1,200 బ్యాంకులో జమ చేసుకున్నా. మూడేళ్ల తర్వాత ప్రభుత్వం రెట్టింపు డబ్బులు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– తిరుమల రాజేశ్వరి, నేత కార్మికురాలు, అమరచింత

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

గత ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో కార్మికులందరం 16 శాతం వాటా డబ్బులు వస్తాయో.. లేదోనని సందేహంగా ఉండేవారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేసింది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.


– పారుపల్లి శ్రీనివాసులు, కార్మిక నాయకుడు

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద కార్మికులకు పూర్తి స్థాయి డబ్బులు విడుదల చేసింది. ఆయా బ్యాంకులకు ప్రభుత్వం వాటా డబ్బులను చెక్కుల రూపంలో అందించాము. బ్యాంకులు కార్మికుల అకౌంట్లలో జమ చేయనున్నాయి. ఈ డబ్బులను వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి.

– గోవిందయ్య, చేనేత, జౌళి శాఖ ఏడీ

కృష్ణా ప్రాజెక్టులకు మరింత తగ్గిన వరద



జూరాల ప్రాజెక్టు

గద్వాల, సెప్టెంబరు 11: కృష్ణాబేసిన్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద తగ్గుతోంది. అయితే భీమా నది నుంచి వరద స్థిరంగా ఉన్నది. బుధవారం ఆల్మట్టికి 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 40 వేల క్యూసెక్కులు ఉన్నది. నారాయణపూర్‌కు ఇన్‌ఫ్లో 40 వేల క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 19,920 క్యూసెక్కులు ఉన్నది. జూరాలకు 1.16 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో భీమా నది నుంచి 40 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. 11 గేట్ల ద్వారా 78,441 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 32,993 క్యూసెక్కులు శ్రీశైలం ప్రాజెక్టుకు వదులుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 34,972 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా గేట్ల ద్వారా 19,461 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సుంకేసులకు 33,793 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా 31,353 క్యూసెక్కులు శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.47 లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోవడంతో గేట్లను మూసి వేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68 వేల క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 210.51 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

ధాన్యం రవాణా టెండర్లలో.. ఉద్రిక్తత

- నెట్టుకున్న దరఖాస్తుదారులు



టెండరు పత్రాల దాఖలు సందర్భంగా వాగ్వాదానికి దిగిన దరఖాస్తుదారులు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 11: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల సివిల్ సప్లయ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ధాన్యం రవాణా టెండర్లలో ఉద్రిక్తత నెలకొంది. టెండర్లను దక్కించుకునేందుకు వ్యాపారులు ఒకరినొకరు అడ్డుకుని నెట్టుకున్నారు. జిల్లాలోని అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ ప్రాంతాల రైతులు పండించిన వానాకాలం వడ్లను తరలించేందుకు వాహనాల కోసం గత నెల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లయ్ కార్యాలయంలో గల టెండరు బాక్స్‌లో వేయాల్సి ఉంది. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నుంచి ఒక్కో దరఖాస్తు మాత్రమే రావడంతో పోటీ లేకుండా పోయింది. కానీ అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గం నుంచి నాలుగేసి చొప్పున దరఖాస్తులు చేశారు. ఫారాలను ఇచ్చేందుకు వచ్చిన వారు ఒకరినొకరు అడ్డుకుని, దూషించుకున్నారు. హిమనిత, ప్రసాద్, నీరజ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చారు. వీరిని కొంతమంది అడ్డుకోవడంతో అదనపు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

15న సీఎం రేవంత్‌రెడ్డి రాక

- దమాగ్నపూర్‌లో జీఎంఆర్ తండ్రి దశదిన కర్మకు హాజరు



చిన్నచింతకుంట, సెప్టెంబరు 11: సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 15 మహబూబ్‌నగర్ జిల్లాకు రానున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. చిన్నచింతకుంట మండలం దమగ్నపూర్‌లో నిర్వహించే దశదినకర్మ కార్యక్రమానికి సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. హెలిప్యాడ్‌కు అనువైన స్థలాన్ని పరిశీస్తున్నట్లు చెప్పారు. సీఎం రాక నేపథ్యంలో దమగ్నాపూర్‌లో గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ముళ్ల పొదలను తొలగిస్తున్నారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో మట్టి వేసి, చదును చేస్తున్నారు.

కుంటలో పడి మహిళ మృతి

కొల్లాపూర్, సెప్టెంబరు 11: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి శివారులోని ఎలకమాన్‌పెంట సమీపంలో గల నల్లరాళ్ల కుంటలో పడి ఓ చెంచు మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మొలచింతలపల్లి భ్రమరాంబ చెంచుగూడేనికి చెందిన మిరపల లక్ష్మి(35), భర్త మిరపల శంకర్ అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం మంగళవారం మధ్యాహ్నం అడవికి వెళ్లారు. వారిద్దరితో పాటు మరికొంత మంది చెంచులు రాత్రి అడవిలోని వారి స్థావరాల్లోనే ఉన్నారు. భార్య లక్ష్మి నల్లరాళ్ల కుంటలో పడి చనిపోయినట్లు శంకర్ బుధవారం ఉదయం గుర్తించాడు. ఘటనపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని సాయంత్రం కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెట్ల పొదల్లో శిశువు

- మహబూబ్‌నగర్ జిల్లా దోకూర్ గ్రామ శివారులో ఘటన
- ఐసీడీఎస్ అధికారులకు అప్పగింత



శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగించిన పోలీసులు

దేవరకద్ర, సెప్టెంబరు 11 : అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల పొదల్లో వదిలేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూర్ గ్రామ శివారులో చోటుచేసుకున్నది. బుధవారం ఉదయం డోకూర్ వద్దగల చెట్ల పొదల్లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన పసికందును వదిలేసి వెళ్లారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదేమార్గంలో వెళుతూ శిశువు ఏడుపును విన్నాడు. దీంతో ఆయన దగ్గరకు వెళ్లి చూసి చీమలు పట్టి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి ఎస్ఐ నాగన్న, అంగన్‌వాడీ టీచర్ చేరుకొని అక్కడి నుంచి ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అనంతరం శిశువుని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు.

కూలిన విద్యుత్ టవర్

- ఆరుగురికి గాయాలు



పడిపోయిన విద్యుత్ టవర్

కల్వకుర్తి, సెప్టెంబరు 11 : పవర్‌గ్రిడ్‌కు చెందిన విద్యుత్ టవర్ కుప్పకూలిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం సుద్దకల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పవర్‌గ్రిడ్‌కు చెందిన 765కేవీఏ పెద్ద టవర్ లైన్ పనులు సుద్దకల్ సమీపంలో జరుగుతున్నాయి. కార్మికులు పని చేస్తుండగా టవర్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఈ-కుబేర్‌ను రద్దు చేయాలి



కేంద్ర కమిటీ నాయకులతో జిల్లా సభ్యులు

పాలమూరు, సెప్టెంబరు 11: ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా మారిన ఈ-కుబేర్‌ను రద్దు చేయాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్ రెడ్డి, ఆర్. చంద్రా నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యవర్గ సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ ప్రతిపాదనను ఏకగ్రీవ తీర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ-కుబేర్‌ను రద్దుచేసి పాతపద్ధతిని అమలు చేసి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

మాతృత్వానికి జాతి విభేదం లేదు

- పందికి పాలు పట్టించిన ఆవు

ఆత్మకూరు, సెప్టెంబరు 11: మాతృత్వానికి జాతి విభేదం లేదని.. ఆవు పందికి పాలిచ్చి మాతృత్వాన్ని చాటుకున్న ఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని బుధవారం చోటు చేసుకుంది. ఒక జాతి జంతువులు మరొక జాతి జంతువులకు పాలిచ్చేందుకు సుముఖత చూపవు. అలాంటిది బిడ్డ ఆకలి తల్లికి తెలుసు అన్నట్టుగా.. పందికి ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా తన పాలను పట్టించి ఆకలిని తీర్చింది. దీనిని గమనించిన స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



ఆవు పాలు తాగుతున్న పంది

టీచర్‌గా మారిన వనపర్తి ఎస్పీ



బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి రూరల్, సెప్టెంబరు 11: వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ టీచర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు బోధించి, వారికి పలు సూచనలు చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, బాలుర పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రేరణ కలిగేలా ఉపాధ్యాయుడిగా వ్యవహరించి తెలుగు వర్ణమాలతో పాటు గణితంలోని పలు అంశాలను బోధించారు. ఆయన బోధన చూసి విద్యార్థులు సంతోషపడ్డారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో భావిభారత పౌరులుగా ఎదగడానికి ప్రాథమిక విద్య సమయంలో నేర్చుకున్న అంశాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అదే విధంగా సైబర్ క్రైమ్ గురించి అవగాహన కలిగి ఉండాలని, షీ టీమ్ యొక్క ప్రత్యేకతలు విద్యార్థులకు తెలిపారు. కళాశాల హెచ్‌ఎం ఉమాదేవి, వనపర్తి సీఐ నాగభూషణం, టౌన్ ఎస్‌ఐ జయన్న, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

18 వరకు జోగుళాంబ హాల్ట్ స్టేషన్ బంద్

ఉండవల్లి, సెప్టెంబరు 11: మండలంలోని జోగుళాంబ రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల నేపథ్యంలో గురువారం నుంచి ఈ నెల 18 వరకు రైల్వే స్టేషన్‌లో పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవని సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్‌లో హైప్లాట్ ఫాం, వెయిటింగ్ హాల్, ముఖ ద్వారం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతిరోజు నడిచే రైళ్లు వారం రోజులు పాటు జోగుళాంబ హాల్ట్ రైల్వే స్టేషన్‌లో పూర్తిగా సర్వీసులు నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

పీయూ ప్రిన్సిపాల్‌కు ఇండియన్ పేటెంట్ రైట్స్



ఇండియన్ పేటెంట్ రైట్స్ పత్రాలతో పీయూ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 11: పాలమూరు యూనివర్సిటీ పీజీ ప్రిన్సిపాల్, రసాయన శాస్త్ర విభాగధిపతి డాక్టర్ చంద్రకిరణ్ తన కొత్త పరిశోధనలు చేసి వాటికి ఇండియన్ పేటెంట్ రైట్స్ సాధించారు. ఐ - బ్రోమో - 4- డైమీథైల్ పిరిడినియం బ్రోమెడ్, 1 - ఐ యాడో - 4 - డైమిథైల్ పిరిడినియం ఐయాడైడ్ అనే నూతన రేయ జేంట్స్ తయారు చేయడం ద్వారా పెంటేంట్ హక్కు పొందారు. ఈ కొత్త పదార్థాలు ఔషద పరిశ్రమలో పర్యా వరణ అనుకూల మందుల తయారీలో ఉపయోగపడనున్నాయి. బుధవారం పెంటేంట్ రైట్స్ పత్రాలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదార్థాల వల్ల తక్కువ ఖర్చుతో, నిర్దిష్ట సమయంలో అధిక దిగుబడితో సాధారణ ల్యాబ్‌లలో ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనకు వాడే ఔషదాల తయారీ, వాటి యొక్క చర్య శీలత పెంచవచ్చునని తెలిపారు. ఏకో ఫ్రెండ్లీ కారకాలు తయారు చేయడం, గ్రీన్ కెమిస్ట్రీ అనుగుణంగా తయారీ ఇప్పుడు డ్రగ్స్ పరిశోధనలో ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ రియోజేంట్స్ తయారీలో తన రీసెర్చ్ స్కాలర్ స్వాతి శ్రమ కూడా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, అధికారులు, అధ్యాకులు, ఉద్యోగులు అభినందించారు.

మృతులు గద్వాల జిల్లావాసులు



బాలస్వామి, జయరాజ్ మృతదేహాలు

మిడ్జిల్, సెప్టెంబరు 11: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లిలో ప్రగతి సోలార్ ప్లాంట్‌లో చోరీకి యత్నించి రెండవ పినిషింగ్‌కు ఉన్న విద్యుత్ షాక్ గురై ఇద్దరు మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను జడ్చర్ల ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. స్థానికులు, సోలాల్ ప్లాంట్ వారు తెలిపిన వివరాల ప్రకారం.. ప్లాంట్‌లో తరుచూ చోరీలు జరుగుతుండడంతో రెండు కంచెలను ఏర్పాటు చేశారు. మొదటి కంచెను సాధారణంగా ఏర్పాటు చేసి లోపల ఉన్న రెండవ కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. సోలర్ ప్లాంట్‌లో ఉన్న రాగి తీగలను, ఇతర వస్తువులను చోరీకి యత్నించిన వారు మొదటి కంచెను కట్టర్లతో కట్‌చేసి, రెండవ కంచెను కట్‌చేస్తున్న సమయంలో కింద నీరు ఉండటంతో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. చోరీకి వచ్చింది ఇద్దరు కాదని మరికొంతమంది ఉన్నారని ప్రమాద స్థలంలో లభించిన మహిళ కాళ్లపట్టి ఆధారంగా స్థానికులు తెలిపారు.

స్పెషల్ బ్రాంచ్ పోలీసుల విచారణ

మృతుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్థానిక పోలీసులు తమకు వారి వివరాలు తెలియలేదనే సమాచారమిచ్చారు. రంగంలోకి దిగిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు బుధవారం జడ్చర్లతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తితో పాటు పలు ప్రాంతాలలో విస్తృతంగా గాలించారు. జడ్చర్ల పట్టణంలోని అల్మాస్ ఫంక్షన్‌హాల్ వెనుక భాగంలో గుడిసెలలో నివాసముంటున్న వారి వద్దకు వెళ్లి విచారించారు. మొదట తమ వారు కారని చెప్పగా, మృతుల ఫొటోలను చూపించిన వెంటనే వారు రోధించినట్లు తెలిపారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించి కుటుంబసభ్యులను జడ్చర్ల ప్రభుత్వ అస్పత్రికి తీసుకెళ్లి మృతదేహాలను చూపించారు. చోరీకి పాల్పడి మృతి చెందిన వారు జోగులాంబ జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లికి చెందిన జక్క బాలస్వామి(44), అతని కుమారుడు జక్క జయరాజ్(19)గా పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబానికి మృతదేహాలను అప్పగించినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసుకుని పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నామని ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం



పీటీజీ గురుకుల పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న ఆర్‌సీవో కల్యాణి

మన్ననూర్, సెప్టెంబరు11: ప్రస్తుత వాతావరణంలో విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్త కల్యాణి సూచించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు ఆదివాసీ గురుకుల విద్యాలయం(పీటీజీ)ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పురాతన విద్యా భవనాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల రక్షణ విషయమై పలు సూచనలు చేశారు. పురాతన భవనంలో తరగతులు నిర్వహించరాదని, కొత్త భవనంలో ఉండే డార్మెట్రిలో తరగతులను తాత్కాలికంగా నిర్వహించాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచి విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులకు వడ్డించే భోజనం తాజాగా ఉండాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో పీటీజీ ప్రిన్సిపాల గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఉపాధ్యాయుల హాజరు

- ప్రభుత్వ పాఠశాలల్లో ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ ఏర్పాటు

- సమయానికి ముందే పాఠశాలలో ఉపాధ్యాయులు



వనపర్తి జిల్లా కేంద్రంలోని తరగతి గదిలో విద్యార్థులు



పాఠశాలకు వచ్చిన వెంటనే అటెండెన్స్ వేసుకుంటున్న ఉపాధ్యాయుడు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 11: సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై ఇది వరకు ఎన్నో సార్లు బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్న విధానం వనపర్తి జిల్లాలో అమలు కాలేదు. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. వారికి నచ్చినప్పుడే బడిబాట పట్టేవారు. దీంతో తాజాగా విద్యాశాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు ఫేస్ రికగ్నేషన్ యాప్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సమయపాలన పాటించని ఉద్యోగులకు చెక్ పడింది. సమయపాలన పాటించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యాశాఖలో మొదలైన ఈ యాప్ త్వరలోనే అన్ని శాఖల ప్రభుత్వ అధికారులకు అమలులోకి రానుంది. ఈ యాప్‌లో ఉపాధ్యాయుల హాజరు నమోదు కానుంది. గైర్హాజరైన ఉపాధ్యాయులకు, పాఠశాలలకు సమయ పాలన పాటించకుండా వచ్చిన వారికి కొరడా పడనుంది. గతంలోనే ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయడంతో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్లిన వెంటనే ఫొటో దిగి అప్‌లోడ్ చేస్తున్నారు. ఉపాధ్యాయులు విధులకు వచ్చిన తరువాత ఆప్షన్ నొక్కితే సదరు ఉద్యోగి ఎన్ని గంటలకు పాఠశాలలకు వచ్చారనే విషయం ఆన్‌లైన్ ద్వారా తెలుస్తుంది. దీనికి సంబంధించి పర్యవేక్షణ అధికారి వద్దకు సమాచారం వెళ్తుంది. కార్యాలయం విడిచి వెళ్లే సమయంలో క్లాస్ అవుట్ చేస్తే ఎన్ని గంటల పాటు ఉన్నారో తెలిసి పోతుంది. కానీ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు సమయపాలన పాటించాలని ప్రభుత్వం ఈ ఆప్షన్ పెట్టినా చాలా మంది ఉపాధ్యాయులు ఉదయం వచ్చి మధ్యాహ్న డుముమ్మా కొడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. వనపర్తి జిల్లాలో 2,400 మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. ఉదయం వేళలో ఏవిధంగా అయితే ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారో, సాయంత్రం వేళలో పాఠశాలను వదిలి బయటకు వెళ్లేటప్పుడు కూడా అదే ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తే మరింత బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతి పాఠశాలలో ఉత్తమ ఫలితాలు



సమయపాలన పాటించని ఉపాధ్యాయులకు ఈ యాప్‌తో చెక్ పడింది. ప్రతీ ఉపాధ్యాయుడు సమయపాలన పాటించడంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నమ్మకం కుదిరింది. ప్రతి పాఠశాలలో ఉన్నత ఫలితాలు సాధించే దిశగా పని చేయడానికి కృషి చేస్తున్నాం. త్వరలోనే సాయంత్రం వేళలో ఈ యాప్ అందుబాటులోకి వస్తది. **- గోవిందరాజులు, డీఈవో, వనపర్తి**

గద్దర్ గళమే ప్రజలకు దిక్సూచి

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

- మన్ననూరులో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్, సెప్టెంబరు 11: ప్రజా సమస్యల కోసం పాటలు, మాటలు, ఆటల రూపంలో చైతన్యం తెచ్చిన గద్దర్ గళమే ప్రజలకు దిక్సూచి అని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు అంబేడ్కర్ కూడలి వద్ద గల బస్టాండ్ ఆవరణలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు .అన్యాయాన్ని ఎదిరించడమే గద్దర్ నైజమని, ఆయనకు నల్లమల ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సమాజం కోసం ఆయన అన్నీ విడిచి పోరాడిన నేత అన్నారు. గద్దర్ విగ్రహ స్థాపనకు ముందుకు వచ్చిన దాత సత్యన్నను ఎమ్మెల్యే అభినందించారు. నియోజకవర్గంలో అత్యధికంగా అంబేడ్కర్ విగ్రహాలను తన హయాంలో స్థాపించడం జరిగిందన్నారు. అదే మాదిరిగా గద్దర్ విగ్రహాలను స్థాపిస్తామని చెప్పారు. నల్లమల అంటే గద్దర్‌కు ఎంతో ఇష్టమైన ప్రదేశమని, ఇక్కడి ప్రాంతంపై ఆయనకు అవినాభావ సంబంధం ఉందన్నారు. చనిపోయే ముందు చివరిసారిగా నల్లమలలోని మన్ననూరులో కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో పాశం యాదగిరి, ఏపూరి సోమన్న, నాసరయ్య, ఎల్లస్వామి, దాసరి శ్రీనివాసులు, పంబలి బుచ్చయ్య, పెర్మల వెంకటేశ్వర్లు, యశ్వంత్, రహీం తదితరులు పాల్గొన్నారు.

అన్నివిధాలా అండగా ఉంటాం

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

- కలెక్టర్‌తో కలిసి నాగర్‌దొడ్డి గ్రామంలో పర్యటన



నాగర్‌దొడ్డి ముంపు గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ధరూరు/గట్టు, సెప్టెంబరు 11 : నిర్వాసితులకు అన్ని విధాలా అండగా ఉంటామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలో జూరాల బ్యాక్‌వాటర్‌లో ముంపునకు గురవుతున్న నాగర్‌దొడ్డి, నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగమైన 101 ప్యాకేజీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న చిన్నోనిపల్లిలో ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ బీఎం సంతోష్ బుధవారం పర్యటించారు. నాగర్‌దొడ్డిలో నీరు చేరిన ఇళ్లను పరిశీలించి, బాధితులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ప్రజలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన షిప్టింగ్ చార్జీలను ఇప్పించినట్లు తెలిపారు. గత కలెక్టర్, మంత్రి సహకారంతో పునరావాస గ్రామంలో 250కి పైగా కుటుంబాలకు పట్టాలను పంపిణీ చేశామని తెలిపారు. కొంత మందికి రాలేదని, వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో చార్జీలను త్వరగా ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. బాధితులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. చిన్నోనిపల్లి ప్రాజెక్టు పనులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని తెలిపారు. ప్రతీ ఒక్కరినీ ప్రభుత్వం తరుపున ఆదుకుంటామన్నారు. ఆరు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రతీ ఒక్కరిని ఆదుకుంటాం : కలెక్టర్ బీఎం సంతోష్

చిన్నోనిపల్లికి ప్రత్యేక అధికారులను నియమించినట్లుగానే నాగర్‌దొడ్డికి కూడా నియమించి అర్హులైన ప్రతీ ఒక్కరిని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. పునరావాస కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించి, ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా తాగు, సాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తామని, రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేసి కొత్త గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. చిన్నోనిపల్లి నిర్వాసితులు 250 మందికి రూ. 16,500 చొప్పున నష్టపరిహారం వారం రోజుల్లో అందేలా కృషి చేస్తామన్నారు. వెంటనే పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. అక్కడ రెండు నెలల్లో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర పనులను రెండు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు ప్రత్యేక నిధి నుంచి మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, ఇరిగేషన్ ఈఈ రహీమొద్దీన్, ఎస్‌ఈ భాస్కర్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సరితారాణి, ఎంపీడీవో చెన్నయ్య, జంబురామన్‌గౌడ, వెంకటరామిరెడ్డి, బషీర్ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి బలవన్మరణం


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. తండ్రి మందలించాడని కూతురు ఎలుకల మందు తాగగా, మరో ఇద్దరు వారి భార్యలు మాట వినలేదని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మహమ్మదాబాద్ సెప్టెంబరు 11: పుట్టిన రోజును పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు చాక్లెట్లు పంచిన విషయమై తండ్రి మందలించాడని కూతురు బలవన్మరణానికి పాల్పడింది. తల్లిదండ్రులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలంలోని దేశాయపల్లికి దొంగల చంద్రకళ, కృష్ణయ్య దంపతుల కూతురు దొంగల శ్రీలత (17) సోమవారం పుట్టిన రోజు ఉన్నందున తల్లి రూ.200 ఇచ్చింది. వాటితో చాక్లెట్లు కొని పాఠశాలలో పంచింది. పాఠశాల నుంచి తిరిగి వచ్చాక.. చాక్లెట్లు పంచడానికి డబ్బులు ఎక్కడివని తండ్రి మందలించాడు. దీంతో ఆమె క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఎలకల మందు తాగి ఇంట్లో వాంతులు చేసుకుంది. తల్లి బాలికను ప్రశ్నించగా.. ఎలుకల మందు తీసుకున్నట్లు చెప్పింది. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

భార్య చెప్పకుండా వెళ్లిందని..

బిజినేపల్లి: భార్య తనకు చెప్పకుండా వెళ్లిపోయిందని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఎస్‌ఐ నాగేశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని కారుకొండతండాకు చెందిన అంగోత్ శంకర్ నాయక్(32) భార్య చెప్పకుండా హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన శంకర్‌నాయక్ మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అన్న రాములు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..



రవికుమార్ (ఫైల్)

కొత్తకోట: భార్య పుట్టింటికి వెళ్లిందని.. క్షణికావేశంలో పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల వడ్డేవాటలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రవి కుమార్ (27) అమరచింతకి చెందిన శ్రావణిని ఐదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుతూరు ఉంది. కాగా శనివారం భార్య పుట్టింటికి వెళ్లి రెండు రోజుల్లో వస్తానని.. బైక్‌పై విడిచి పెట్టిరమ్మని భర్తని కోరింది. వెళ్లొదని భర్త చెప్పినా వినకుండా ఊరికి వెళ్లింది. దీంతో క్షణికావేశానికి గురైన రవి కుమార్ సోమవారం పొలం వద్ద ఉన్న గడ్డి మందు తాగి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన సమీప రైతులు కుటుంబసభ్యులకు చెప్పారు. వెంటనే ఆయనని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదారాబాద్ గాంధీ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రాజెక్టులను పరిశీలించిన అధికారులు



సరళసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు

మదనాపురం,సెప్టెంబరు11: వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళసాగర్, రామన్‌పాడు ప్రాజెక్టులను డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు బుధవారం పరిశీలించారు. సరళసాగర్ ప్రాజెక్టు వద్ద సైఫన్ తెరుచుకున్నప్పుడు దాని పైభాగంలో సన్నగా పగుళ్లు ఏర్పడి నీరు వస్తుందని గ్రహించి మరమ్మతుల విష యంపై ఉన్నతాధికారులకు విషయం తెలియజేశారు. అదే విధం గా రామన్‌పాడు ప్రాజెక్టు యొక్క గేట్ల పరిస్థితిని తెలుసుకున్నారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిటైర్డు చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, డీఈ సతీష్, ఇరిగేషన్ ఏఈ రనీల్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిజినేపల్లి, సెప్టెంబరు 11 : పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని రాంరెడ్డిపల్లికి చెందిన శీనయ్య(40), కూతురు చెరియకు ఈనెల 9న కూతురు పుట్టి చనిపోయింది. మనవరాలు మృతి చెందిన బాధలో మద్యం తాగిన శీనయ్య పురుగు మందు తాగి స్పృహ కోల్పోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఈఘటనపై మృతుడి సోదరుడు శివుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

తాడూరు, సెప్టెంబరు 11 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఆకునెల్లికుదురులో బుధవారం ప్రమాదవశాత్తు గ్రామానికి రాజేందర్‌రెడ్డికి విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో అతనికి చేతికి గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. ఈ ఘటనపై ట్రాన్స్‌కో ఏఈని వివరణ కోరగా.. ఎల్‌టీ లైన్‌కు సంబంధించి కిందపడిపోయిన మాట వాస్తవమే అని తెలిపారు. ఆ లైన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశామన్నారు. రాజేందర్‌రెడ్డి తన సొంత మోటారు వద్ద స్టార్టర్‌లో మరమ్మతు చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగిందన్నారు.

వీధికుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 11: వీధి కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మండలలోని సింగారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన బూరం రాములు ఇంటి వద్ద గొర్రెపిల్లలను పాకలో ఉంచగా రాత్రి కుక్కలు దాడి చేయడంతో ఆరు మృతి చెందాయి. వారం రోజుల క్రితం క్రితం కూడా ఇలాంటి దాడి జరిగినట్లు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై గేదె మృతి

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 11 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని మహాసముద్రం చెందిన బెల్లే చంద్రశేఖర్ తన గేదెలను మేపడానికి గ్రామ శివారులోకి వెళ్లాడు. కేఎల్‌ఐ కాల్వ వద్ద నీళ్లు తాపేందుకు గేదెను తీసుకొస్తుండగా విద్యుత్ స్తంభం విరిగి పడడంతో వేలాడుతున్న వైర్లకు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.65వేలు ఉంటుందని బాధితుడు చంద్రశేఖర్ తెలిపారు.

నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

మరికల్, సెప్టెంబరు 11 : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మండలంలోని ఆశోక్‌నగర్ కాలనీకి చెందిన ఎరుకలి ఇంద్రజ చుట్టు పక్కల గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఓ ఇంట్లో నిల్వ చేసింది. పక్కా సమాచారంతో ఎస్‌ఐ మురళీ, సిబ్బంది దాడులు నిర్వహించి 17.80 క్వింటాళ్ల రేషన్ బియాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డిప్యూటీ తహసీల్దార్ కాళప్ప పంచనామా అనంతరం ఇంద్రజపై కేసు నమెదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహమ్మదాబాద్‌లో..

మహమ్మదాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల గేటులో బీట్ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా పక్కా సమాచారం మేరకు గురువారం ఉదయం తనిఖీ చేశారు. వెంకటేష్ తన దుకాణంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచాడు. తనిఖీల్లో 16 బస్తాల బియ్యం దొరికాయి. బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

షీ టీం గస్తీ పెంచాలి



ఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవాబ్‌పేట, సెప్టెంబరు 11 : మండలంలో విద్యాసంస్థల్లో చదువుకోవడానికి వస్తున్న విద్యార్థినులపై ఆకతాయిల వేధింపులు అధికమైనందున షీ టీం గస్తీ పెంచాలని తెలంగాణ సామాజిక సేవా సమితి నాయకులు కోరారు. నాయకులు శ్రీరామ్, నరేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ విక్రంకు ఫిర్యాదు చేశారు. మండలంలో రెండు కళాశాలలు ఉన్నందున వివిధ గ్రామాల నుంచి ఆటోలలో, నడుచుకుంటూ విద్యార్థులు వస్తున్నారని, కొంతమంది ఆకతాయిలు అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. షీ టీం నిఘా పెంచి, ఆకతాయిల ఆటకట్టించాలని కోరారు. అమ్మాయిలను వేధించే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 11: శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని నిర్వాసితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రజాభవన్ ఎదుట నిరసన చేపట్టి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డికి, ప్రజాదర్బార్ అధికారి దివ్యరాణికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని జీవో 98ని ప్రభుత్వం జారీ చేసిందని, 40ఏళ్లు గడుస్తున్నా జీవోను అమలు చేయడంలేదని, దీంతో తమ సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. ఎప్పటికి న్యాయంచేస్తారని ప్రశ్నించారు. ఆయా జిల్లాల అభ్యర్థుల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి అందించామని, ఆమోదించి నిర్వాసితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

బాధితులను ఆదుకుంటాం

శ్రీశైలంప్రాజెక్టు నిర్వాసితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి నిర్వాసితులకు హామీ ఇచ్చారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండలం గుమ్మడం, యాపర్ల, తిప్పాయిపల్లి, చిన్నంబావి మండల నిర్వాసితులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 11: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తక్షణం అవసరమైన మౌలిక వసతులపై ప్రతిపాదనలు ఇవ్వాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూపర్‌వైజర్లను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ భవనాల స్థితిగతులు, సదుపాయాలపై తెలుసుకున్నారు. నివేదిక తయారీపై అవగాహనకల్పించారు. కార్యక్రమంలోసీడీపీవోలు సూపర్‌వైజర్‌లు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలి



నల్లచెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గిరిధర్

వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 11: ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం గణేష్ శోభాయాత్ర నిమజ్జనం జరిగే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శోభాయాత్రతో పాటు నిమజ్జనానికి సంబంధించి పోలీస్ అధికారులు సూచించే నిబంధనలను నిర్వాహకులు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వెంట మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్, మునిసిపల్ డీఈ యూనిస్, సీఐ నాగభూషణంరావు, ఎస్ఐ జయన్న ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



కొత్తకోటలో శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎంలు

చిన్నంబావి సెప్టెంబరు 11, మండల పరిధిలోని వెల్టూరు గ్రామ పాఠశాలలో యాపర్ల గ్రామా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శంకర్‌గౌడ్ రాష్ట్రస్థాయి ఉత్తమఅవార్డు అందుకున్న సందర్భంగా ఉపాధ్యాయుడికి వెల్టూరు గ్రామపాఠశాల సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు గణేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాములు ఎంపీడీవో ఎంపీవో పాల్గొన్నారు

కొత్తకోటలో..

కొత్తకోట, సెప్టెంబరు 11 : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న శంకర్‌గౌడ్‌ను మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బుధవారం సన్మానించారు. శంకర్‌గౌడ్ మండల విద్యావనరుల కార్యాలయంలో జరిగిన పాఠశాలల కాంప్లెక్స్ సమావేశానికి హజరయ్యారు. ఈసందర్భంగా సమావేశానికి హజరైన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శాలువాతో సన్మానించి జిల్లా నుండి రాష్ట్ర అవార్డు అందుకోవడం అందరికి గర్వ కారణమని 30సంవత్సరాలుగా శంకర్‌గౌడ్ విద్యాశాఖకు చేస్తున్న సేవలను కొనియడారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య, హెచ్‌ఎంలు వివేకానంద, చంద్రశేఖర్, ప్రవీణ్ కుమార్, మద్దిలేటి, గణేష్ కుమార్, శంకరయ్య రమేష్, కేశవాచారి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని పాఠశాలలో చేర్పించిన కౌన్సిలర్

పెబ్బేరు, సెప్టెంబరు 11: పట్టణంలో బడికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉన్న ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో కౌన్సిలర్ అక్కమ్మ చేర్పించారు. శ్రద్ధ తీసుకుని పిల్లలను పాఠశాలలో చేర్పించడంతో ఎంఈఓ జయరాములు కౌన్సిలర్ అక్కమ్మను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మణెమ్మ ఉన్నారు. బడిలో చేర్పించిన విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు.

భజన పోటీల్లో మూలమల్లకు మొదటి స్థానం

ఆత్మకూరు, సెప్టెంబరు 11: వినాయక ఉత్సవాల సందర్భంగా పాలమూరు జిల్లా చిన్నచింతకుంట మండలంలో బాలగంగాధర్ తిలక్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భజన పోటీల్లో మూలమల్ల గ్రామం మొదటి స్థానంలో నిలిచిందని భజన మండలి అధ్యక్షుడు భగవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి 8గంటల నుంచి బుధవారం వేకువ జామున 5గంటల వరకు నిర్వహించిన పోటీల్లో ఆయా మండలాలకు సంబంధించిన పది భజన మండలి బృందాలు పాల్గొనగా వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్లకు చెందిన పాండురంగ స్వామి భజన మండలి మొదటిస్థానం కైవసం చేసుకుంది. ఈసందర్భంగా బాలగంగాధర్ తిలక్ యువజన సంఘం నాయకులు భజన మండలి సభ్యులను శాలువాలతో సన్మానించి నగదుతో పాటు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాండురంగ స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, భజన మండలి సత్యరెడ్డి, సోమిరెడ్డి, వెంకటరెడ్డి, సునంద గౌడ్, రుద్రయ్య చారి, భాస్కర్, శేఖర్, పలువురు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 11: ప్రస్తుత సామాజిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ వంటి వివిధ శాఖలలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆత్మకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ముందు నిరసన బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి మోష మాట్లాడుతూ... ఆసుపత్రిలో వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో కార్మికులు అర్థాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటవ తారీఖున వేతనాలు చెల్లిస్తున్న అదే ప్రభుత్వ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంచడం భావ్యం కాదన్నారు. వేతనాలు చెల్లించాలని కాంట్రాక్టు ఏజెన్సీని కార్మికులు ప్రశ్నిస్తే తీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో వేతన బడ్జెట్ విడుదల చేసి కార్మికులకు వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఆసుపత్రి కార్మికులను ఐక్యం చేసి ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు సత్తార్, ఖాజా, మైనుద్దిన్, శైలజ, మణెమ్మ, నాగమ్మ, బాలకృష్ణమ్మ, పార్వతమ్మపాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే భూ సేకరణ చేయాలి

- రెవెన్యూ అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 11: భూ సేకరణ చేసేటప్పుడు రెవెన్యూ అధికారులు ప్రభుత్వం సూచించిన నిబంధనలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా అనుసరించాల్సిన విధి విధానాలను రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోహర్ ద్వారా బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులకు శిక్షణ ఇప్పించారు. పీఎస్‌పీడీ అవార్డులు పాస్ చేసేటప్పుడు 2013, 2017 యాక్టుతో పాటు ప్రభుత్వ ఉత్తర్వులు, మెమోలను తప్పకుండా అనుసరించాలని మనోహర్ రెవెన్యూ అధికారులకు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టులు, రోడ్లు ఇతర అంశాలకు భూసేకరణ చేస్తున్నామని, పిలిచిన వెంటనే సమయం కేటాయించి, సలహాలు, సూచనలు ఇచ్చినందుకు మనోహర్‌కు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

యువతను ఓటరు జాబితాలో చేర్చాలి

జనవరి 1, 2025 నాటికి వయస్సు 18సంవత్సరాలు నిండిన యువత పేర్లను ఓటరు జాబితాలో చేర్చేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమీక్ష నిర్వహించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2011లో 4, 5 సంవత్సరాల వయస్సున్న పిల్లల సంఖ్యను అన్నిమండలాల తహసీల్దార్లకు ఇచ్చామని, వాటి ప్రకారం ఇప్పుడు ఎంతమంది 17, 18సంవత్సరాల యువత ఉంటారో తెలిసిపోతుందన్నారు. అర్హుల నుంచి ఫారం-6 తీసుకోవడానికి కళాశాలలు, పెళ్లి అయిన జంటలను గుర్తించాలని, మరణించిన ఓటర్ల పేర్లను ఫారం-7 ద్వారా జాబితా నుంచి తొలగించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి నూతన ఓటరు నమోదుకు సహకారం తీసుకోవాలని చెప్పారు. ఓటరు జాబితాలో దివ్యాంగులను గుర్తించి మార్కింగ్ చేయాలని, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. కొత్తగా పోలింగ్ స్టేషన్ కావాలనుకుంటే తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్, ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత గోదాంలోకి వీవీ ప్యాట్‌లు తరలింపు

ఆర్డీవో కార్యాలయంలోని తాత్కాలిక గోదాంలో ఉంచిన వీవీప్యాట్‌లను తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన శాశ్వత గోదాంలోకి తరలించినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 33లో భద్రపరిచిన అదనపు, శిక్షణ నిమిత్తం వాడిన ఈవీఎంలను కూడా తరలించామని, బుధవారం చేపట్టిన ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించి, వారి సమక్షంలోనే మార్చినట్లు తెలిపారు. రిపేరులో ఉన్న ఒక కంట్రోల్ యూనిట్, తొమ్మిది వీవీ ప్యాట్‌లను మరమ్మతుల కోసం హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్‌లు కిషన్, చాంద్‌పాషా, మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ వేణాచారి, బీజేపీ కుమారస్వామి, బీఆర్‌ఎస్ సయ్యద్ జమీల్, సీపీఎం పరమేశ్వరచారి, టీడీపీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 11: జిల్లాలో క్రీడాపాఠశాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి కలెక్టర్‌ను కోరారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి ఐడీవోసీలో కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో ఇంటర్మీడియట్ స్థాయివరకు స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, అందుకు సరిపడా 25ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వనపర్తి జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను గూగుల్ ఎర్త్ మ్యాప్ ద్వారా చూపారు. నాగవరం మెడికల్ కళాశాల వద్ద ఉన్న స్థలాన్ని సందర్శించిన చైర్‌పర్సన్ ఇక్కడ స్థలం అనువుగా ఉందని, కనీసం 25 ఎకరాలు కేటాయించాలని కోరారు. తర్వాత హాకీ, ఇండోర్ స్టేడియాలను సందర్శించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు చైర్ పర్సన్ వెంట ఉన్నారు.

తెలంగాణలో స్పోర్ట్స్‌కు మహర్దశ

పెబ్బేరు : రానున్న రోజుల్లో తెలంగాణలో స్పోర్ట్స్‌కు మహర్దశ కలగనున్నదని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. బుధవారం పెబ్బేరులో శివసేనారెడ్డికి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి సౌమ్యకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో స్పోర్ట్స్‌ను పట్టించుకోలేదన్నారు. త్వరలోనే గ్రామస్థాయి నుంచి సీఎం కప్పు క్రీడలు ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి ప్రాంతానికి 4వ పాఠశాల మంజూరుకు కృషి చేస్తామన్నారు. పెబ్బేరు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ , వైస్ చైర్మన్ కర్రెస్వామి, వనపర్తి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కేఎల్‌ఆర్ స్పోర్ట్స్ చైర్మన్ కృష్ణకుమార్ రెడ్డిఉన్నారు. అంతర్జాతీయ క్రీడాకారిణి సౌమ్యను ప్రెస్‌క్లబ్‌సభ్యులు సన్మానించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

పెబ్బేరు : మండలంలోని బాలబాలికలకు క్రీడా పోటీలను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి బుధవారం పెబ్బేరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్నిరకాల క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని 17 పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల నిర్వహణకు ఉపాధ్యాయుడు నరసింహగౌడ్ రూ.20వేలు, హీరో హోండా యజమాని ప్రవీణ్ రూ.15వేలు, పాఠశాలకు బీరువా అందించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ , వైస్ చైర్మన్ కర్రెస్వామి, వనపర్తి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మండల విద్యాశాఖ అధికారి జయరాములు, వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వని బీఆర్‌ఎస్

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు, శ్రీరంగాపురం, సెప్టెంబరు 11: గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. బుధవారం శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. శ్రీరంగాపూర్‌లో 26 మందికి, పెబ్బేరులో 50 మందికి చెక్కులతోపాటు సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెబ్బేరు, శ్రీరంగాపురం తహసీల్దార్లు లక్ష్మి, మురళిగౌడ్, ఎంపీడీవో రవీంద్ర, నాయకులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పెబ్బేరు మునిసిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ వెంకటేష్ సాగర్, ఎద్దుల సాయినాథ్ , సురేందర్ గౌడ్, దయాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు పార్వతి, సుమతి, శ్రీహరి, రాజు, దయాకర్ రెడ్డి, షకీల్, రామన్ గౌడ్, రాములు యాదవ్, మాజీ ఎంపీటీసీ ఎల్లస్వామి యాదవ్, నాగవరం మధుగౌడ్, యాపర్ల రామ్‌రెడ్డి, బీరం రాజశేఖర్ రెడ్డి, వాయిద్దీన్, మండల కాంగ్రెస్ టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మాడల్‌గా వనపర్తిని తీర్చిదిద్దుతా..

పెద్దమందడి, సెప్టెంబరు 11: అభివృద్ధి అంటేనే వనపర్తి గుర్తుకు వచ్చేలా వనపర్తి నియోజకవర్గాన్ని రెండేండ్లలో అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. బుధవారం పెద్దమందడి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న వనపర్తి-పెద్దమందడి రహదారి విస్తరణ నిర్మాణ పనులను రూ.36 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళా సంఘాల బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అందుకు అనుగుణంగా పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను గుర్తించి వారికి రూ.16,500 చొప్పున నష్టపరిహారం అందజేస్తామన్నారు. ఇండ్లు దెబ్బతిన్న బాధితులు వారి వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సద్గుణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు



జూరాలలో సంతకాల సేకరణ చేపట్టిన నిర్మాణ రంగ కార్మికులు

ఆత్మకూరు,సెప్టెంబరు11: భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పొద్దని ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతు ఐఎఫ్‌టీయు, అలాగే భవన నిర్మాణ కార్మిక సంఘాలతో కలిసి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా బుధవారం ఆత్మకూరు మండల పరిధిలోని జూరాల గ్రామంలో ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ... తెలంగాణ భవన , ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం వంటి సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం ద్వారా నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ పథకాలకు గండి కొట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రమాద మరణానికి ఆరు లక్షల నుంచి 5 లక్షలకు కుదించారని, అలాగే ఎల్ఐసీ ఏజెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి కార్మికులపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. కావునా ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా ఇన్సూరెన్స్ అమలు చేయాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ రంగ కార్మికులు పరుశురాముడు, శివ, వెంకటన్న, రాములు, పరమేష్, మహేష్, సత్తన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక క్రీడా పాఠశాల

- జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి

మదనాపురం, సెప్టెంబరు 11: క్రీడలను ప్రోత్సహించడానికి విద్యార్థులకు జిల్లాలో ప్రత్యేక క్రీడా పాఠశాలను నెలకొల్పడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు ఆడి నప్పుడు విద్యార్థులలో మానసి క ప్రశాంతత, ఉత్తేజం, కలుగుతుందని అన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలో గెలిచిన విద్యార్థులకు బహు మతులు అందజేశారు. అంతకుముందు విద్యార్థులకు 1982-83వ సంవత్సరం పదవ తరగతికి చెందిన పూర్వపు విద్యార్థులు స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, మండల విద్యాధికారి కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు సుదర్శన్‌రావు, మహేందర్‌గౌడ్, వెంకటేష్‌నాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శిని సన్మానించిన బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దమందడి, సెప్టెంబరు 11: బదిలీపై వెళ్తున్న గ్రామ కార్యదర్శిని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. రెండు ఏళ్లుగా మోజర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవలే చేపట్టిన బదిలీల్లో ఇతర మండలానికి వెళ్లారు. బుధవారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పూల మాలలు, శాలువాలతో ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని, అలాగే కొత్తగా వచ్చిన గ్రామ పంచాయతీ కార్యదర్శిని సన్మానించారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హరిచంద్రారెడ్డి, గట్టుసతీష్, వెంకట్రాములు గౌడ్, విజయచారి, తిరుపతయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో అన్నదాన కార్యక్రమం

అమరచింత, సెప్టెంబరు 11: పట్టణంలోని బీసీ కాలనీ గణేష్ నగర్ వినాయకుని మండపం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం విజయవంతమైంది. సినీ నిర్మాత, సామాజిక వేత్త, చేనేత వ్యాపారస్తుడు మహంకాళి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గణేష్‌నగర్ వినాయకుని వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు చిన్ని సీతారాములు, ఒగ్గు రామలింగం, కొంకతి నరసింహ, గాజుల వెంకటేష్, చిన్ని లక్ష్మి, అలివేలమ్మ, సువర్ణ, సంధ్య కృష్ణ, రమేష్, రఘు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

వీపనగండ్ల, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని కచేరి వద్ద, చాపల వారి ఎల్లమ్మ గుడి దగ్గర ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. బొడ్డెమ్మ, కోలాటాలు ఆడుతూ ఊరేగింపుగా తరలించారు. అంతకుముందు మండపాల వద్ద అన్నదానం చేశారు.

గణేశ్ మండపాల వద్ద అన్నదానం

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు.

కల్వరాలలో మొసలి సంచారం

వీపనగండ్ల, సెప్టెంబరు 11: మండలంలోని కల్వరాల ఔడకుంట సమీపంలో మంగళవారం రాత్రి మొసలి సంచరించింది. మొసలి కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన వ్యక్తంచేశారు. గ్రామస్తులు వెంటనే నాగర్ కర్నూల్ జిల్లా దేవాదాయశాఖ జిల్లా అధికారి నరసింహ ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ఫారెస్టు అధికారి రాణి గ్రామానికి వచ్చి కుంటప్రాంతాన్ని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పట్టుకుంటామని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్గీకరణ చేయకుండా రిజర్వేషన్లు కొనసాగించాలి

వనపర్తి టౌన్, సెప్టెంబరు 11: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎటువంటి ఉపవర్గీకరణ చేయకుండా అలాగే క్రిమిలేయర్ అమలు చేయకుండా ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు కొనసాగించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి డిమాండ్ చేశారు. జిల్లాకమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీచేపట్టారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సలహాదారుడు కర్నే త్యాగయ్య, సహదేవుడు, నాగేశ్వర్‌రావు, నాగన్న, మల్లేష్, రంగస్వామి, ధశరథం, నాగరాజు, మధుసూదన్, సంజీవ్, రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికుల కోసమే ఖర్చు చేయాలి

వనపర్తి టౌన్, సెప్టెంబరు 11: వెల్ఫేర్ బోర్డు ద్వారా ప్రభుత్వమే కార్మికులకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధ) జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను నేరుగా ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. ప్రమాద మరణాలకు రూ.10లక్షలు, సహజ మరణాలకు రూ.5లక్షలు, దహన సంస్కారాలకు, ప్రసూతి, వివాహ ఖర్చులకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య, బాలస్వామి, భాస్కర్, మన్యం, సాగర్, నరసింహ, శ్రీనివాసులు, గొల్ల వెంకటయ్య, చీర్ల వెంకటేష్, రాజు, కృష్ణయ్య, నందిమల్ల రాములు, మహమూద్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలి

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 11: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉన్నత, ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ సుభాష్, మండల ప్రధాన కార్యదర్శి రాకేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవికిరణ్, శంకర్, సాగర్ పాల్గొన్నారు.

ఎక్కువ మంది సభ్యులున్న పార్టీ బీజేపీ

వనపర్తిరూరల్, సెప్టెంబరు 11: ప్రజాస్వామ్య దేశాల్లో ఎక్కువ మంది సభ్యులు గల పార్టీ బీజేపీ అని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి మండల పరిధిలోని మెంటపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సభ్యత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ బూత్ అధ్యక్షుడు సోమన్న, కన్వీనర్ తిరుపతయ్య, నాయకులు ఉన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 11: వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్స్ స్కీమ్ ద్వారా వనపర్తి మండలం పెద్దగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగస్వామి, ఉపాధ్యాయులు రాధిక, రవీందర్‌రెడ్డి, శేఖర్, రాములు, వైఆర్‌జీకేర్ సంస్థ ఆలిబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలపురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 11: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి అందించనున్న ఈ అవార్డులకు ఈనెల 15వతేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆవిష్కరణ సృజనాత్మకత సామాజిక సేవ, పర్యావరణం క్రీడలు కళలు సంస్కృతి సైన్స్ అండ్ టెక్నాలజీ ఇతర రంగాల్లో ప్రతిభ కలిగిన 18ఏళ్లలోపు బాల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

అమరచింత, సెప్టెంబరు 11: పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అమరచింత పట్టణంలోని పలు వినాయక మండపాల వద్ద ఎస్ఐ సురేష్ పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐతో పాటు ఏఎస్ఐ జమీర్, పోలీస్ సిబ్బంది పర్వతాలు, సహదేవుడు , రాములు తదితరులు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న గణనాథులు

కొత్తకోట, సెప్టెంబరు 11 : మండలంలో వాడవాడల్లో వెలసిన గణనాథులు 5వ రోజు బుధవారం భక్తులచే పూజలందుకున్నారు. పట్టణంలో పాత పట్టణం, దండుగడ్డ, విద్యానగర్, రాఘవేంద్ర కాలనీ, రచ్చకట్ట, పెట్రోల్ బంకు పక్కన ఉన్న గణపతి విగ్రహాలకు భక్తులు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు.